క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ లోటస్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోటస్ సెక్టార్ ఒకటి, రెండు, మూడు, లోటస్ ల్యాండ్‌మార్క్ మెయిన్ రోడ్డు, కేదారేశ్వరపేట, జీరోలైన్ నుంచి ఐదో లైన్ వరకు, శాంతినగర్, రామలింగేశ్వర పేట, సీకే రెడ్డి రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వీధుల్లో వ్యర్థాలు



పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారు ప్రాంతాల్లో వరదల్లో మునిగిన ఇళ్లల్లో గృహోపకరణాలు, పాడైపోయిన వ్యర్థాలు ఇప్పటికీ వీధుల్లో కనిపిస్తూనే ఉన్నాయి. వరద వచ్చి 17 రోజులవుతున్నా సుందరయ్యనగర్, విశాలాంధ్రనగర్, డాక్టర్స్ కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో వ్యర్థాలు వీధుల్లో ఉండటం వల్ల వాటి నుంచి పురుగుపుట్ర వస్తున్నాయని స్థానికులు అంటున్నారు. నగర పాలకసంస్థ సిబ్బంది ఎప్పటికప్పుడు వాటిని ట్రాక్టర్ల ద్వారా తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తడిసిపోయిన డబుల్‌కాట్ మంచాలు, పరుపులు, పాడైన ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లకు సంబంధించినని రోడ్లపైనే ఉన్నాయి. చిన్న చిన్న రోడ్లు కావడంతో ట్రాక్టర్లు లోపలకు వెళ్లడానికి వీలులేక పాడైపోయిన వస్తువులను తొలగించలేకపోతున్నామని సిబ్బంది చెబుతున్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని కళాశాలలు, పాఠశాలలు, హాస్టల్‌లోని విద్యార్థులకు దిశ విద్యార్థి సంఘం, నవజవాన్ భారత్ సభ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు త్వరలో తేదీ, కేంద్రం తెలియజేస్తామన్నారు. 'భగత్‌సింగ్ త్యాగం: భారతదేశంలో సామాజిక మార్పు, యువత పాత్ర ' అనే అంశంపై వ్యాసరచన, 'స్వాతంత్ర్యంపై భగత్‌సింగ్ ఆలోచనలు – నేటి పరిస్థితి' అంశంపై వక్తృత్వ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో విజేతలకు ఈనెల 28న బహుమతులు అందజేస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం 9133844458 నెంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

ముమ్మరంగా చెత్తాచెదారం తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్‌లో బుడమేరు తగ్గుముఖం పట్టడంతో చెత్తాచెదారం తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు బుడమేరు నీటిలో మునిగి ఉన్న రోడ్లు బయటపడ్డాయి. రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని బాబ్‌గేట్‌తో తొలగిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది బ్లీచింగ్ చల్లి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికి వారు వారి ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. కార్యక్రమాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, మేస్త్రి శ్రీనివాసరావు, నాయకులు గరిమెళ్ల చిన్నా పర్యవేక్షించారు.

సీఎం ప్రకటన హిందువుల మనోభావాలను దెబ్బతీసింది

మధురానగర్(విజయవాడసెంట్రల్): తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామివారి పవిత్ర లడ్డూ ప్రసాదం విషయంలో సీఎం చంద్రబాబునాయుడు చేసిన ప్రకటన హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బ తీసిందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ అన్నారు. గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. లడ్డూను భక్తులు సాక్షాత్తు స్వామివారి వర ప్రసాదంగా భావిస్తారని అన్నారు. సీఎం చంద్రబాబు ప్రకటన హిందువుల మనస్సులను కలిచివేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి వేగంగా దర్యాప్తు పూర్తిచేసి నిందితులను శిక్షించాలని కోరారు. రాజకీయాల కోసం పవిత్ర దేవాలయాలను ఉపయోగించుకుంటే తగిన శాస్తి చేయడానికి హిందువులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కోశాధికారి దుర్గాప్రసాద్ రాజు, అధ్యక్షుడు సానా శ్రీనివాస్, రాఘవరాజు, కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆసుపత్రిపై కేసు నమోదు

విజయవాడస్పోర్ట్స్: డోర్నకల్ రోడ్డులోని తల్లీబిడ్డ ఆసుపత్రిపై కేసు నమోదు చేసినట్లు సూర్యారావుపేట సీఐ అలీ గురువారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా పని చేస్తున్న వ్యక్తి తన భార్యను ప్రసవం కోసం ఈనెల 16వ తేదీన ఆసుపత్రిలో చేర్చారని, డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే తన బిడ్డ మరణించిందంటూ సదరు అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వరద బాధితులకు ఆపన్న హస్తం

దాతలు, వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ

పాయకాపురం(విజయవాడ రూరల్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష్‌రావు ఆదేశాల మేరకు కడప జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్.రమణ ఆధ్వర్యంలో ఆ శాఖ ఉద్యోగులు సామాజిక సేవా సంఘం తరఫున గురువారం వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సుమారు వెయ్యి మందికి ఏడు లక్షల 50వేల రూపాయల విలువైన నిత్యావసర సరుకులను రాజీవ్‌నగర్ ప్రాంతంలోని బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఈఈ కన్‌స్ట్రక్షన్, సామాజిక సేవా సంఘం అధ్యక్షుడు డి.నాగరాజు, జనరల్ సెక్రటరీ ఎం.వి. చలపతి, ఈఈ యస్. భరణికృష్ణ, అధికారులు, సిబ్బంది, అన్ని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో..

వైఎస్సార్ సీపీ అధిష్టానం వరద బాధిత కుటుంబాలకు పంపిన నిత్యావసర సరుకులను 64వ డివిజన్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి యర్రగొర్ల శ్రీరాములు, దండు సుబ్రహ్మణ్యం రాజు, పలువురు పార్టీ శ్రేణులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ 64వ డివిజన్‌లో 600 బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేసినట్లు తెలిపారు.

ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

కండ్రిక, ప్రకాష్‌నగర్, వాంబే కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న 150 విశ్వబ్రాహ్మణ వరద బాధిత కుటుంబాలకు గురువారం నిత్యావసర వస్తువులను ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం అందజేసింది. ఈ సందర్భంగా ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చేవూరు రామస్వామి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలోని వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు. సంఘం ప్రతినిధులు తామరపల్లి దుర్గాప్రసాద్, నల్లమాటి కొండబాబు, పుట్ట భాస్కర్, చిట్టిమోజు శ్రీనివాస్, పందూరి శివ, బ్రహ్మజీ పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న కడప విద్యుత్ సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 32వ డివిజన్‌లో బుడమేరు వరద బాధితులకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన గురువారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆ పార్టీ డివిజన్ ఇన్‌ఛార్జి గుండే సుందర్‌పాల్ మాట్లాడుతూ వరద బాధితులకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పేరం త్రివేణి రెడ్డి, ఆనంద్, లక్ష్మణ, ప్రభల శ్రీను, పుష్పలత, కొర్నేలు, సువర్ణరాజు, హనుమంతరెడ్డి, శాంతి, సుబ్బారావు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిగమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వరద బాధితులకు దుప్పట్లు, ప్లేట్లు పంపిణీ చేశారు. సింగ్‌నగర్ అగ్నిమాపకశాఖ అధికారులతో కలిసి ఫౌండేషన్ సభ్యులు సింగ్‌నగర్, రాజీవ్‌నగర్, కండ్రిక ప్రాంతాల్లోని 1,200 బాధిత కుటుంబాలకు ఆ కిట్లను అందించారు. అగ్నిమాపక శాఖ డీజీ రమణ, ఆ నలుగురు సేవా సమితి సభ్యులు మంజుల, వెంకటేష్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే సంస్కార భారతి సంస్థ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ వరదలకు గురైన కళాకారులకు నిత్యావసర సరుకులు, చీరల పంపిణీ కార్యక్రమం సింగ్‌నగర్ లూనాసెంటర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో గురువారం జరిగింది. ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ, దాతలు పొన్నపల్లి విశ్వ శ్రీనివాస్, సుధాకర్, సంస్థ సభ్యులు సాయిశంకర్, సాయి సౌమ్య, విశ్వకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



32వ డివిజన్‌లో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న గుండే సుందర్‌పాల్, త్రివేణిరెడ్డి



బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న నిగమ ఫౌండేషన్, అగ్నిమాపక శాఖ అధికారులు

ఆరోగ్యకర వాతావరణం కల్పించండి

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ సక్రమంగా చేస్తూ ప్రజలకు ఆరోగ్యకర వాతావరణాన్ని కల్పించాలని నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రం రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు, బుడమేరు వంతెన, పైపుల్ రోడ్డు, ఉడా కాలనీ, న్యూ రాజీవ్ నగర్, కండ్రిక జర్నలిస్ట్ కాలనీ, 33 తూముల రోడ్డు, పీఅండ్‌టీ కాలనీ వాంబే కాలనీ, పైపుల్ రోడ్డు జంక్షన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగాలని, డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు పూడిక తొలగించాలని, రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండేలా వ్యర్థాలను తొలగించాలని, మురికిగా ఉన్న రోడ్లను నీటితో శుభ్రం చేయాలని సూచించారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో వరద నీటి నిల్వలు ఉన్నాయని, వాటిని తోడేయాలని అధికారులను ఆదేశించారు.



అజిత్‌సింగ్ నగర్‌లో వరదలకు దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చర్యలు తీసుకుంటూ, దోమలు, వాటి వల్ల కలుగు వ్యాధులను యాంటీ లార్వే ఆపరేషన్ల నిరంతరం కొనసాగించాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజలకు ఆరోగ్యకరమైన పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

పటమట(విజయవాడతూర్పు): పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే నగరం పరిశుభ్రంగా, సుందరంగా ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం సఫాయిమిత్ర సురక్ష శిబిరం నిర్వహించారు. నగరంలో రేయింబవళ్లు శ్రమించే పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సఫాయిమిత్ర సురక్ష ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలోనే కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 40 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో మూడు వేల మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులకు డాక్టర్లు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన కార్మికులుకు రక్త పరీక్షలు, మధుమేహం, థైరాయిడ్ తదితర పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులు అందజేశామని కమిషనర్ ధ్యాన చంద్ర తెలిపారు.



వైద్య పరీక్షలకు వచ్చిన పారిశుద్ధ్య కార్మికులు

దసరా మహోత్సవాలకు వీఎంసీ సిద్ధం

పటమట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ మూడు నుంచి 12వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాలకు విజయవాడ నగరపాలక సంస్థ సిద్ధంగా ఉందని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో దసరా ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీఎంసీ చర్యలు తీసుకుంటోందన్నారు. భక్తులకు కావాల్సిన తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, క్లాక్ రూంలు, పారిశుద్ధ్య నిర్వహణ, గుడి వరకు వెళ్లే రోడ్లకి ప్యాచ్ వర్కులకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 35 లక్షల వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు, 150 తాత్కాలిక మరుగుదొడ్లు, ఆరు క్లాక్ రూములు ఏర్పాటు చేస్తామని, 27 ప్రాంతాల్లో 1400 మంది పారిశుద్ధ్య కార్మికులతో మూడు షిఫ్టుల్లో పారిశుద్ధ్య పనులు చేపడ్తామని వివరించారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు ఆయా విభాగాల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూంలో 24 గంటలు పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు వెళ్లే గిరి ప్రదక్షిణ దారిలో ప్యాచ్ వర్క్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో మాదిరి ఈ సారి కూడా భవాని భక్తులు వదిలి వెళ్లే వస్త్రాల సేకరణకు ఘాట్లలో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేశామని, ఘాట్ల నుంచి వ్యర్థాల తరలింపునకు 18 ట్రాక్టర్లను వినియోగిస్తామని తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ముగిసిన వరసిద్ధి వినాయక మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీ వరసిద్ధి వినాయక 38వ చవితి మహోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారిని ఉంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ నృత్యాలతో మధురానగర్, పసుపుతోట పురవీధుల మీదుగా ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు గడ్డం మేస్త్రి, రంకిశెట్టి బాలాజీ పర్యవేక్షించారు.

రహదారి భద్రతపై అవగాహన



మధురానగర్(విజయవాడసెంట్రల్): యువత ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని విజయవాడ 5వ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ మీద యువత అవగాహన కలిగి ఉండాలని, అతివేగంగా వాహనాలు నడపకూడదని అన్నారు. హెల్మెట్, సీటు బెల్టు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి రక్షిస్తాయని చెప్పారు. విద్యార్థులతో ట్రాఫిక్ మీద అవగాహన కల్పించే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ డి. యుగంధర్, శర్వాణి, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ లక్ష్మీజానకి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో, మినిగూడ్స్ డ్రైవర్‌లకు రూ. 25 వేలు సాయం అందించాలి

ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం, ఐఎఫ్‌టీయూ వినతి

విజయవాడస్పోర్ట్స్: ఆటో, మినీ గూడ్స్, మోటార్ వెహికల్ డ్రైవర్‌లకు ప్రభుత్వం రూ. 25 వేల ఆర్థిక సాయం అందించాలని ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం, ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని డీఆర్వో వి.శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ బుడమేరు వరదతో ఆటోలు నీట మునిగి రిపేర్లకు గురయ్యాయన్నారు. సందడిలో సడేమియా అన్నట్లుగా ఆటో రిపేర్లకు సర్వీస్ కంపెనీలు రూ. 40 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నాయని తెలిపారు. థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ ఉన్న పాత మోడల్ ఆటోలకు నయాపైసా రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇన్సూరెన్స్ కోసం పెట్టుకున్న అర్జీలను కంపెనీలు పరిష్కరించడం లేదన్నారు. రవాణాశాఖ కమిషనర్ చొరవ తీసుకుని ఈ పరిస్థితిని చక్కదిద్దాలని కోరారు. నెల రోజులపాటు ఉపాధి కోల్పోయిన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.వి.రమణ, ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నాయకులు జి.కోటేశ్వరరావు, జి.రాజు, జి.జెస్సీబాబు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న ఆటో కార్మిక సంఘాల నాయకులు

బాధితులకు అఖిల భారత చాత్తాద శ్రీవైష్ణవ సమాఖ్య వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపు ప్రాంతాల్లో సర్వం కోల్పోయిన చాత్తాద శ్రీవైష్ణవ బాధితులకు అఖిల భారత చాత్తాద శ్రీవైష్ణవ సమాఖ్య (హైదరాబాద్) నిత్యావసర సరుకులను వితరణ చేసింది. సమాఖ్య అధ్యక్షుడు తిరుక్కోళ్లూరి రామానుజం, ఉపాధ్యక్షుడు సుదర్శన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం భవానీపురంలోని శ్రీసాయి అన్న గార్డెన్‌లో సుమారు 150 మందికి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. బుడమేరు వరద చాత్తాద శ్రీవైష్ణవులను కోలుకోలేని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకోవడం తమ బాధ్యతగా భావించి హైదరాబాద్ నుంచి వచ్చి తమకు తోచిన సాయం అందించామని తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య ఏపీ సెక్రటరీ మధురాంతకం శ్రీనివాసరావు, నాయకులు ఎస్పీ శేషగిరిరావు, పొట్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ పి.విజయలక్ష్మి, కంతాయిపాలెం ఓంప్రకాష్, టి.లక్ష్మయ్య, ఆర్.శ్రీకాంత్, కేశవపట్నం గిరిబాబు, టి.రాజేష్, పి.రఘురాం తదితరులు పాల్గొన్నారు.



ముంపు బాధితులకు సాయం అందిస్తున్న సమాఖ్య నాయకులు

నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలి

విజయవాడ కల్చరల్: తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని విద్యావేత్త డాక్టర్ సూర్యచంద్రరావు అన్నారు. శ్రీరామకృష్ణా నాట్యమండలి 49వ వార్షికోత్సవ వేడుకలు, నాటక రంగానికి కృషి చేసిన వారికి సేవా పురస్కారాల కార్యక్రమాన్ని గురువారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూర్యచంద్రరావు మాట్లాడుతూ 49 సంవత్సరాలుగా నాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న రామకృష్ణా నాట్యమండలి వ్యవస్థాపకుడు డాక్టర్ జొన్నలగడ్డ జగన్‌మోహనరావు సేవలను అభినందించారు. సాహితీవేత్త గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ నాటకం తెలుగువారి ఆత్మ అని వివరించారు. నాటక రచయితలు సామాజిక చైతన్యానికి నాటకాలను ఆయుధంగా మలుచుకున్నట్లు తెలిపారు. రామకృష్ణా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి డాక్టర్ జొన్నలగడ్డ జగన్‌మోహనరావు, కోశాధికారి జొన్నలగడ్డ శ్రావణకుమార్, డాక్టర్ పీవీఎస్ కృష్ణ, కస్తూరి రామారావు, చింతా వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతశర్మ తదితరులు పాల్గొన్నారు. నాటక రంగానికి చెందిన కుందుర్తి వెంకటకృష్ణకు రంగస్థల దీప్తి పురస్కారం, తాడేపల్లి వెంకట సుబ్బారావు, చింతలపూడి నాగేశ్వరరావు, గణేష్ కుమార్, ఎండీ పెదబాబు, అమ్ముల పార్వతి, అమ్ముల సువర్ణ, ఎస్. కోటేశ్వరి, బి. నాగలక్ష్మి, కె. వాసుదేవరావులకు కళాసేవక్ పురస్కారాలు, పొన్నేపల్లి సాయిశంకర్, చింతాదూండీ కృష్ణ, జీఎన్‌డీ కుసుమ సాయి, బి. రూపశ్రీలకు యువ రంగస్థల పురస్కారాలను ప్రదానం చేశారు.



నాటకరంగ ప్రముఖుడు వెంకటకృష్ణకు రంగస్థల దీప్తి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్‌సెంటివ్ స్కీమ్‌లపై నేడు సమావేశం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కేంద్ర ప్రభుత్వం బడ్జెట్–2024లో ప్రకటించిన ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్‌సెంటివ్ స్కీమ్‌ల అమలుపై చర్చించడానికి శుక్రవారం సమావేశం జరుగుతుందని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బందరు రోడ్డులోని డీవీ మానర్ హోటల్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఏపీ స్టేట్ జోన్ అదనపు సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ వీరభద్ర స్వామి హాజరవుతారని పేర్కొన్నారు. ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్‌సెంటివ్ స్కీమ్‌ల అమలుకు సంబంధించిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారని వివరించారు.

త్రిశక్తి పీఠం హుండీ ఆదాయం రూ. 8.26 లక్షలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానానికి (త్రిశక్తి పీఠం) హుండీల ద్వారా రూ.8,26,825 ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ తెలిపారు. దేవస్థానం ఆవరణలో గురువారం హుండీ కానుకలను లెక్కించారు. దేవదాయశాఖ అధికారి కె.అనురాధ పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు హుండీ కానుకలను లెక్కించారు. 140 రోజులకు ఆలయంలోని 12 హుండీల ద్వారా ఈ ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ కమిటీ అధ్యక్షుడు గొల్లపూడి పుల్లయ్య, ఆధ్యాత్మిక సలహాదారుడు బి.హెచ్.విజయకిరణ్, కమిటీ సభ్యులు ఎం.రాజా, జి.సత్యనారాయణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ టీటీ జిల్లా జట్టుకు ఐజీఎంసీ క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్–19 టేబుల్ టెన్నిస్ ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టులో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్(ఐజీఎంసీ) క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. ఈనెల 18వ తేదీన పటమటలోని సీహెచ్ ఆర్‌కే ఇండోర్ స్టేడియంలో జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలికల విభాగంలో కె. వసుధ, పి.ఐశ్వర్య, బాలుర విభాగంలో పి.కిరణ్‌తేజ, ఎ.షణ్ముఖ్, కె.నిహాల్ అర్హత సాధించారు. ఈనెల 20, 21 తేదీల్లో పటమట సీహెచ్ ఆర్‌కే ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారు. వీరంతా ఐజీఎంసీ స్టేడియంలో కోచ్‌లు బి.శ్రీనివాస్, షేక్ షారుఖ్ అక్రమ్, షేక్ గౌస్‌బాషా వద్ద శిక్షణ పొందుతున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను గురువారం ఏపీ టీటీ సంఘం కార్యదర్శి పి.విశ్వనాథ్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.బలరామ్ అభినందించారు.



ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

పచ్చని పొలాలు.. కన్నీటి పాలు



వరద ముంపు తర్వాత ఎండిపోయిన వరి పంట

మధురానగర్(విజయవాడసెంట్రల్): పచ్చని పొలాలు వరద ఉధృతికి నీటి పాలు అయ్యాయి. వరద ముంపుతో దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డులోని వరి పొలాలు ఎండిపోయాయి. ఈనెల ఒకటో తేదీ వరకు పచ్చగా కళకళలాడిన వరి పొలాలు ఇప్పుడు ఎండుగడ్డిని తలపిస్తున్నాయి. మొత్తం పొలం బుడమేరు వరద వల్ల ఎండిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పెట్టిన పెట్టుబడి వరద పాలు అయ్యిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



వరదలకు ముందు దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డులోని వరి పంట

బహుముఖ ప్రతిభాశాలి తాపీ ధర్మారావు



విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి తాపీ ధర్మారావు అని సమైఖ్యభారతి వ్యవస్థాపకుడు కన్నయ్య అన్నారు. సమైఖ్యభారతి, తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సాహితీవేత్త, సంపాదకుడు తాపీ ధర్మారావు జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. కన్నయ్య మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో వేగుచుక్కలాంటి వాడు తాపీ ధర్మారావు అని కొనియాడారు. సమైఖ్యభారతి సాంస్కృతిక సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నల్లా పవన్‌కుమార్ తాపీ ధర్మారావు సాహిత్య సేవలను వివరించారు. విద్యావేత్త డాక్టర్ ఎంసీ దాస్ తాపీ ధర్మారావు జీవిత విశేషాలను వివరించారు. ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కమ్ముల శేషుకుమార్, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు కే డేవిడ్‌రాజు, బోడి ఆంజనేయరాజు, మీరాకుమార్, మల్లాది స్వాతి, సింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు అతిథులను, గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.